క్లుప్తంగా

కోవెలకుంట్ల ఎస్‌ఐగా వరప్రసాద్



కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా వర ప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎస్‌ఐల బదిలీల్లో భాగంగా ఇక్కడ ఎస్‌ఐగా పనిచేస్తున్న వెంకటరెడ్డిని వీఆర్‌కు వెళ్లారు. ఆ స్థానంలో కర్నూలు జిల్లా ఆస్పరి ఎస్‌ఐగా పనిచేస్తున్న వరప్రసాద్‌ను నియమించడంతో విధుల్లో చేరారు.

సంతాపం

బనగానపల్లె రూరల్ : మండలంలోని చెర్లోకొత్తూరుకు చెందిన యాదవ సంఘం నాయకుడు నక్క రామస్వామియాదవ్(62) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న అఖిలభారత యాదవ మహాసభ నియోజకవర్గ కన్వీనర్ మద్దయ్యయాదవ్ తదితర నాయకులు సంతాపం తెలిపారు. మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గణమద్దిలేటి యాదవ్, శంకర్, పర్లపాటి నాగశేషుడు, శివకృష్ణ, రంగస్వామి, సుధాకర్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బదిలీ

కొలిమిగుండ్ల: త్వరలో జరుగనున్న సాధారణ ఎన్నికలను నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం తహసీల్దార్ల బదిలీలు జరుగుతున్నాయి. కొలిమిగుండ్ల తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్‌ను చిత్తూరు జిల్లాకు బదిలీ చేస్తు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాదిన్నర పాటు ఆయన ఇక్కడ విధులు నిర్వహించారు. కొలిమిగుండ్ల తహసీల్దార్‌గా ఎవరనేది తెలియాల్సి ఉంది.

రక్తదానం ప్రాణదానంతో సమానం



సమావేశంలో మాట్లాడుతున్న మహమ్మద్ రఫీ

బేతంచెర్ల: రక్తదానం ప్రాణదానంతో సమానమని నంద్యాల జిల్లా రెడ్ క్రాస్ కార్యవర్గ సభ్యులు నాగ సురేంద్ర, సామాజిక కార్యకర్త మహమ్మద్ రఫీ తెలిపారు. మండల పరిధిలోని గోరుమానుకొండ గ్రామ సమీపాన ఉన్న ఏపీ మోడల్ స్కూలు, జూనియర్ కళాశాల విద్యార్థులకు రక్తదానం, అవయవ దానంపై ప్రిన్సిపాల్ మరియదాసు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ రక్తదానంపై అపోహలు విడాలని, ప్రమాద సమయంలో బాధితుల ప్రాణాలు నిలిపివారవుతారని చెప్పారు.

వ్యక్తి అదృశ్యం



ఉసేనయ్య(ఫైల్)

కోవెలకుంట్ల: మండలంలోని భీమునిపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ కల్పన బుధవారం తెలిపారు. ఎస్‌ఐ సమాచారం మేరకు గ్రామానికి చెందిన ఉసేనయ్య నాలుగు రోజుల క్రితం శనగలు పట్టే జల్లెడ ఇచ్చి వస్తానని ఇంట్లో నుంచి వచ్చాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితులను ఆరా తీశారు. అయితనా ఆచూకీ తెలియకపోవడంతో ఉసేనయ్య కుమారుడు రాకేష్ కోవెలకుంట్ల పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు వ్యక్తి అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.


పేరుసోముల క్రీడాకారుల ప్రతిభ



క్రీడకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం శీతారావమ్మ

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల క్రీడకారులు నియోజకవర్గం స్థాయి ఆడుదాం ఆంధ్రా వాలీబాల్ క్రీడా పోటీలో ప్రతిభ చాటారు. ఈ నెల 29న బనగానపల్లెలో జరిగిన నియోజకవర్గ స్థాయిలో పోటీలలో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈమేరకు క్రీడాకారులను పేరుసోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శీతారావమ్మ, పీడీ ప్రతాప్, సచివాలయ సిబ్బంది అభినందించారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట



ఎల్‌ఈడీ స్క్రీన్‌పై అభివృద్ధిని చూస్తున్న గ్రామాల ప్రజలు

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్ద పీట వేశారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని హుసేనాపురం, రహిమానుపురం గ్రామంలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సారథ్యంలో నియోజకవర్గంలో జరిగిన విద్య, వైద్య, రహదారుల అభివృద్ధిని ఎల్‌ఈడీ స్క్రీన్‌పై గ్రామస్తులకు చూపించారు.

సంజామల... మెరిసేలా!

- ప్రభుత్వ కార్యాలయాలతో కళకళలాడుతున్న మండల కేంద్రం
- సీసీ రోడ్ల నిర్మాణాలతో మారిన కాలనీల రూపురేఖలు
- ఓహెచ్‌ఆర్ ట్యాంక్ నిర్మాణంతో తీరిన తాగునీటి సమస్య
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు





రూ. 1.20 కోట్లతో నూతనంగా నిర్మించిన ఎంపీడీఓ కార్యాలయం

సంజామల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధితో మండల కేంద్రం సంజామల మెరుస్తోంది. ప్రభుత్వ కార్యాలయాలు, సీసీ రోడ్ల నిర్మాణాలతో గ్రామం రూపురేఖలు మారిపోయాయి. ప్రజాసంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యనిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో సంజామలకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు సమకూరాయి. దాదాపు రూ.6.62 కోట్లు వెచ్చించి గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఎంపీడీఓ కార్యాలయం, ఏరియా పశువైద్యశాల భవనాలు నిర్మించింది ప్రభుత్వం. దీంతో మండల కేంద్రం సంజామల కళకళలాడుతోంది. సీసీ రోడ్ల నిర్మాణంతో ప్రధాన రోడ్లు విశాలంగా దర్శనమిస్తున్నాయి. అదేవిధంగా పొలాల రహదారుల ఏర్పాటుతో రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి. అదేవిధంగా రూ.రూ.35 లక్షలు వెచ్చించి నిర్మించిన ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌తో తాగునీటి సమస్య పరిష్కారమైంది. మండల కేంద్రం పూర్తిస్థాయిలో అభివృద్ధి జరగడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు సంజామల ప్రజలు.

గతంలో పేరుకే మండల కేంద్రం చూడ్డానికి కుగ్రామం!

గతంలో మండల కేంద్రం సంజామలను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పేరుకేమో మండల కేంద్రం చూడ్డానికి మాత్రం కుగ్రామం అనేలా ఉండేది. ఎంపీడీఓ కార్యాలయం, ఏరియా పశువైద్యశాల అద్దెభవనాల్లో నిర్వహించేవారు. ప్రత్యేకించి ఎంపీడీఓ కార్యాలయం మరీ అధ్వానంగా ఉండేది. వర్షం వస్తే పరిస్థితి మారీ దారుణం. ఫైళ్లను కాపాడుకునేందుకు నానాపాట్లు పడేవారు. రహదారుల పరిస్థితీ అంతే. గుంతలమయంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. ఇక పొలాల రస్తా మరీ అధ్వానంగా ఉండేది. ప్రత్యేకించి దిగుబడులు తీసుకొచ్చేందుకు రైతులు ఇబ్బందులు వర్ణనాతీతం. సమస్యలను గుర్తించిన ఎమ్మెల్యే కాటసాని ప్రత్యేక చొరవతో పరిష్కరించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు



రూ. 30 లక్షలతో ఓహెచ్‌ఆర్ ట్యాంక్

గ్రామంలో కొన్ని అభివృద్ధి పనుల వివరాలు..

- రూ.1.20 కోట్లతో నిర్మించిన ఎంపీడీఓ కార్యాలయం
- రూ.75 లక్షలతో నూతనంగా నిర్మించిన ఏరియా పశువైద్యశాల
- నీటి సమస్య పరిష్కారానికి రూ.35 లక్షలతో నిర్మించిన ఓహెచ్‌ఆర్ ట్యాంక్
- రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలమం భవనం
- రూ.22 లక్షలతో ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రం
- రూ.45 లక్షలతో సీసీ రోడ్లు, డైనేజీల నిర్మాణం
- రూ.10 లక్షలతో రస్తాలకు గ్రావెల్ రోడ్లు
- రూ.1.60 కోట్లతో పాఠశాల అభివృద్ధి

ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తుంది. గత టీడీపీ ప్రభుత్వం పాలకులు మండల కేంద్రం సంజామలను ఏ మాత్రం పట్టించుకోలేదు. సరైన ఎంపీడీఓ కార్యాలయం లేక చాలా ఇబ్బందులు పడ్డాం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాకే సంజామలలో అభివృద్ధి జరిగింది. ప్రతి సమస్యను పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసానికి ప్రజల తరుపున కృతజ్ఞతలు.

– గుండం సూర్య ప్రకాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్.

గతంలో చాలా ఇబ్బందులు పడ్డాం



గతంలో రోడ్లు అధ్వానంగా ఉండేవి. వర్షాకాలం అయితే చాలా ఇబ్బందులు పడేవారం. నీటి నిల్వల మూలంగా అనారోగ్యానికి గురైన సందర్భాలు ఉన్నాయి. వర్షం వస్తే వారంపాటు బురదతో సావాసం చేయాల్సిన దుస్థితి. ప్రస్తుతం సీసీ రోడ్లు వేయడంతో రాకపోకలకు ఇబ్బంది లేదు. మా ఎస్సీ కాలనీయే కాదు... అన్ని వీధులు బాగున్నాయి.

–వెంకట సుబ్బన్న, సంజామల

ప్రభుత్వ తీరు బాగుంది....



గతంలో సంక్షేమ పథకాల గురించి తెలిసేదే కాదు. వలంటీర్ల ద్వారా అన్ని విషయాలు తెలుస్తున్నాయి. నాకు సంబంధించి అమ్మఒడి, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా పథకాలు వర్తించడంతోపాటు గ్రామంలో సీసీ రోడ్లు, కొత్త భవనాలు నిర్మాణాలు జరిగాయి. వైద్య సేవలు బాగా అందుతున్నాయి. ప్రభుత్వ తీరు బాగుంది. మళ్లీ జనన్ననే ముఖ్యమంత్రిగా చేసుకుంటాం.

– రాములమ్మ, సంజామల

నగర పంచాయతీ అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న చలం రెడ్డి

బేతంచెర్ల: మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో పట్టణంలోని 20 వార్డుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో వార్డు కౌన్సిల్ సర్వసభ్య సమావేశం చైర్మన్ చలం రెడ్డి అధ్యక్షతన కమిషనర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా కాలనీలో రూ.2,85,83,037 చేపట్టే అభివృద్ధి పనులు, మహిళల సౌకర్యార్థం సంజీవనగర్–2 వడ్డెపేట, దుర్గాపేట, జంగాలపేట కాలనీ కొనసాగుతున్న సామూహిక మరుగు దొడ్ల నిర్మాణాల వివరాలను కమిషనర్ తెలిపారు. ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను కౌన్సిలరులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.అలాగే చేపట్టిన, చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు చెల్లించాల్సిన బిల్లులు వార్డు సభ్యుల ఆమోదంతో తీర్మాణం చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు చింతల నాగిరెడ్డి, మధు, ఎల్లయ్య, కోట్ల మధు సూధన్, యంగమ్మ, హుసేన్ బీ, అబీదా తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేసినప్పుడే గుర్తింపు



మురళీమద్దిలేటి దంపతులను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

కోవెలకుంట్ల: ప్రభుత్వ ఉద్యోగులు అంకిత భావంతో పనిచేసినప్పుడే తగిన గుర్తింపు లభిస్తుందని బీసీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ అన్నారు. కోవెలకుంట్ల బీసీ హాస్టల్ వెల్ఫేర్ అధికారిగా పనిచేస్తున్న మురళీ మద్దిలేటి బుధవారం పదవీ విరమణ పొందారు. మురళీమద్దిలేటి దంపతులను యూనియన్ నాయకులు ఘనంగా సత్కరించారు. అలాగే గుళ్లదూర్తి బీసీ హాస్టల్ ఇన్‌చార్జ్ హెచ్‌డబ్ల్యూఓగా మురళీ మద్దిలేటి విధులు నిర్వర్తించిన నేపథ్యంలో ఆ గ్రామస్తులు సైతం ఆయను ఘనంగా సన్మానించారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగేంద్ర, మునిరాజు, చైతన్యలక్ష్మి, ఎర్రమ్మ, శ్రీధర్‌బాబు, గోవర్ధన్, రాముడు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆదరించండి



సంజీవనగర్ కాలనీ ప్రజలతో మాట్లాడుతున్న అర్జున్ రెడ్డి

బేతంచెర్ల: సమర్థవంతమైన పాలన, అభివృద్ధికి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోమారు ఆదరించాలని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తనయుడు అర్జున్ రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ డైరెక్టర్ బాబుల్ రెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాజా హుసేన్ కోరారు. బుధవారం పట్టణంలోని సంజీవనగర్ కాలనీలో బుగ్గన అర్జున్ రెడ్డి పర్యటించారు. ఈసందర్భంగా కాలనీల్లో వైఎస్సార్ ప్రభుత్వ హయంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. అవ్వ, తాత పింఛన్ వస్తుందా, అమ్మ వైఎస్సార్ చేయూత, ఆసరా అందుతుందా అని అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. అనంతరం వారు మాట్లడుతూ ఎవ్వరి సిఫారసు లేకుండా అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి దక్కిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సురేంద్రనాథ్‌రెడ్డి, చందు రెడ్డి, మల్లికార్జున, కిరణ్, గోపాల్ రెడ్డి, నాగరాజు, నిరంజన్, ఆనంద్, హరి, రంగనాయకులు, తలారి మధు, రవి పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు తెలపండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

డోన్ టౌన్ : ఓటర్ల తుదిజాబితాపై ఎలాంటి అభ్యంతరాలున్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ వెంకటరెడ్డి తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం ఈ నెల 22వ తేది వెలువడిన ఓటర్ల తుది జాబితాపై అఖిల పక్ష పార్టీల నాయకులతో ఆర్డీఓ సమావేశం నిర్వహించి అభ్యంతరాలను స్వీకరించారు. ఆర్డీఓ మాట్లాడుతూ కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు అవకాశం ఉందన్నారు. మార్పులు, చేర్పులు, తొలగింపులకు నోటిఫికేషన్ వెలవడటానికి ఒక వారం ముందు వరకు అవకాశం ఉందని వివరించారు. సమావేశంలో తహసీల్దార్ విద్యాసాగర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

డోన్‌లో పిచ్చి కుక్క స్వైరవిహారం



పిచ్చికుక్క దాడిలో గాయపడిన రజాక్



ఆసుపత్రికి తరలి వచ్చిన బాధితులు

డోన్ టౌన్ : పట్టణంలో బుధవారం రాత్రి పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. దాదాపు 30 మందిని కాటేసింది. ఇందిరానగర్, రాజా థియేటర్ వెనుక, వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో, కొత్తపేట, పట్టణ పోలీసు స్టేషన్, విజయగ్యాస్ తదితర ప్రాంతాల్లో పిచ్చి పట్టిన కుక్క తిరుగుతూ ఎదుటపడిన వారిని తీవ్రంగా గాయపరచింది. పది మంది చిన్నారులతో పాటు మొత్తం 30మందికి గాయాలు అయ్యాయి. రూరల్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహించే రజాక్ అనే కానిస్టేబుల్, గణేష్ రాము(ప్రభుత్వ ఐటీఐ విద్యార్థి), డీఎస్పీ కార్యాలయం వద్ద పిచ్చికుక్క భారిన పడి గాయాలు అయ్యాయి. వీరందరూ ఒక్క సారిగా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లడంతో కిక్కిరిసిపోయింది. డాక్టర్లు, నర్సులు ప్రథమ చికిత్సలు అందించి యాంటీ రాబిష్, టీటీ ఇంజక్షన్లు ఇచ్చి సత్వర వైద్యం అందించారు.

శాలివాహనులు ఐకమత్యంగా మెలగాలి

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



కవయిత్రి మొల్లమాంబ విగ్రహావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, నాయకులు

బనగానపల్లె రూరల్ : శాలివాహనులు ఐకమత్యంగా మెలగాలని, వారి అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా నూతనగా నిర్మించిన ఫోర్‌లైన్స్ రోడ్డుపై ఏర్పాటు చేసిన మొదటి మహిళా తెలుగు కవయిత్రి మొల్లమాంబ విగ్రహాన్ని బుధవారం రాష్ట్ర కుమ్మర శాలిశాహన కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తంతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సురేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడారు. సమాజంలో కుమ్మరుకుల ప్రత్యేక గౌరవం, గుర్తింపు ఉందన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అమలు చేసిన ఫీజు రియింబర్స్‌మెంట్‌తో ఎంతో మంది శాలివాహన కులస్తుల పిల్లలు ఉన్నత చదువులు అభ్యసించారని, వివిధ రంగాల్లో స్థిరపడ్డారని గుర్తు చేశారు. తండ్రిబాటలోనే సీఎం వైఎస్ జగన్ ముందుకు సాగుతున్నారని, విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి తదితర పథకాలను కొనసాగిస్తూ వారి సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. బనగానపల్లె నియోజకర్గాన్ని అంకితభావంతో తాను అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేని టీడీపీ నాయకులు అసత్యారోపణలకు పాల్పడుతున్నారని విమర్శించారు. మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లోనూ మౌలిక వసతులు కల్పించామని, ప్రత్యేకించి బనగానపల్లె పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శాలివాహన సంక్షేమానికి కట్టుబడి ఉన్నారని, కుమ్మర శాలివాహన కార్పొరేషన్ ఏర్పాటు చేసి న్యాయం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అవుకు మండల వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, రవీంద్ర విద్యాసంస్థల అధినేత గూడూరు పుల్లయ్య, యాగంటి ఆలయ చైర్మన్ తొటబుచ్చిరెడ్డి, డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, శాలివాహన సంఘం ప్రధాన కార్యదర్శి శివరామ మద్దిలేటి, నంద్యాల జిల్లా శాలివాహన సంఘం అధ్యక్షుడు మద్దయ్య, గౌరవ సలహాదారులు బాబయ్య, నాగరాజు, కనకాద్రిపల్లె మాజీ సర్పంచ్, డాక్టర్ దస్తగిరి, నాయకులు జ్యోతిశ్వర్లు, రఘురాముడు, మహేష్ బాబు ,శివయ్య,దస్తగిరి, వెంకట సుబ్బయ్య, చిన్నయ్య, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె పట్టణాన్ని సుందరంగా తీర్చిదిదుతాం



పూల మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె : బనగానపల్లె పట్టణాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నామని, ఇంకా సుందరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. బుధవారం ప్రభుత్వ అతిథి గృహం నుంచి నూతనంగా ఏర్పాటు చేసిన ఫోర్‌లైన్స్ సెంటర్‌లో ఎమ్మెల్యే పూల మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ ఓ మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, రవీంద్ర విద్యాసంస్థల చైర్మన్ పుల్లయ్య, రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం, గ్రామ పంచాయతీ ఈఓ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ సహకారం అభినందనీయం



మాట్లాడుతున్న ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి

డోన్ రూరల్ : ఎంపీడీఓ శ్రీనివాసులు మండలాభివృద్ధికి అంకితభావంతో కృషి చేశారని, ఆయన సహకారం అభినదనీయమని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి కొనియాడారు. ఎంపీడీఓ శ్రీనివాసులు అనంతపురం జిల్లాకు బదిలీ కావడంతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రాజ్‌కుమార్‌యాదవ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామచంద్రుడు, ఏఈలు సతీష్, నారాయణ, ఐసీడీఎస్ సీడీపీఓ శంషాద్‌బేగం, సీనియర్ అసిస్టెంట్ సుధీర్, మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



వాహనచోదకులతో మాట్లాడుతున్న ఎంవీఐ క్రాంతికుమార్

డోన్ టౌన్: వాహనచోదకులు నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎంవీఐ క్రాంతి కుమార్ హెచ్చరించారు. స్థానిక బేతంచెర్ల రోడ్డులో బుధవారం ఆయన ఆర్టీసీ డిపోమేనేజర్ శశిభూషణ్‌తో కలసి వాహనాలను తనిఖీ చేశారు. డోన్–బేతంచెర్ల మార్గంలో వాహన చోదకులు అక్రమంగా ప్రయాణికులను ఎక్కించుకుని ఆర్టీసీ ఆదాయానికి గండికొట్టడం సరికాదన్నారు. ఫిట్నెస్ సర్టిఫికెట్, ఇతర ధ్రువపత్రాలు లేకుండా తిరుగుతున్న, అధిక లోడ్‌తో వెళ్తున్న 14 వాహనాలకు రూ. 51,505 జరిమానా విధించారు.

ప్రజాపోరాటాల కోసం విరాళాల సేకరణ

ప్యాపిలి: ప్రజాపోరాటాల కోసం విరాళాల సేకరణ చేస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ తెలిపారు. బుధవారం వారు పట్టణంలో పలు దుకాణాల వద్ద విరాళాల సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల తరుపున పోరాడేందుకు అవసరమైన నిధిని ప్రజలు, వ్యాపారుల నుంచి సేకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్, సీపీఐ పట్టణ కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్, నాయకులు రామచంద్రుడు, అంజనేయులు, నాయకులు శివకేశవులు, చంద్రనాయక్, శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంజామల తహసీల్దార్ బదిలీ

సంజామల: ఎన్నికల నేపథ్యంలో సంజామల తహసీల్దార్ జీవీ మల్లికార్జున రావు బదిలీ అయ్యారు. ఈయనను చిత్తూరు జిల్లాకు బదిలీ చేస్తూ ఉన్నత అధికారులు ఉత్తర్వులు జారీ చేశా రు. మల్లికార్జున రావు సంజామల తహసీల్దార్‌గా దాదాపు రెండున్నరేళ్ల విధులు నిర్వర్తించారు.